

సాక్షి బాపట్ల

ఆదివారం । 22 । జనవరి । 2023



పులిచింతల నీటినిల్వ


అచ్చంపేట: పులిచింతల ప్రస్తుత నీటి నిల్వ 43.2071 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 1200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, దిగువకు 2,200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1,716 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. పలు కాలువలకు 1,525 క్యూసెక్కులు నీటిని వదిలారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శనివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

ఎంపీ నిధులతో స్టీలు బెంచీలు



లక్ష్మీపురం (గుంటూరు పశ్చిమ): కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అన్ని విధాల సదుపాయాలు కల్పించడం జరుగుతోందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. గుంటూరులోని రైల్వే స్టేషన్‌లో రూ.50 లక్షల ఎంపీ నిధులతో గుంటూరు, నరసరావుపేట జిల్లాలోని 12 రైల్వే స్టేషన్‌లలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్లాట్‌ఫారంలపై స్టీల్ బెంచిలను ఏర్పాటు చేసి వాటిని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రతిపక్షాలు కూడా అంగీకరించక తప్పదన్నారు. దీనికి నిదర్శనమే వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌రైలు, ప్లాట్‌ఫారాల ఆధునీకరణ, స్మార్ట్ స్టేషన్‌ల నిర్మాణం అని తెలియజేశారు. అదే విధంగా వచ్చే ఏడాదిలోగా గుంటూరు రైల్వే స్టేసన్‌లో రూ.20 కోట్లతోనూ గుంటూరు డివిజన్‌లోని ఇతర 30స్టేసన్‌లను రూ.10 కోట్లతోనూ ఆధునికీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం గుంటూరు, పల్నాడు ప్రాంతాలకు చెందిన స్థానికుల సమస్యలను, రైల్వే స్టేషన్‌లలో ఆటోడ్రైవర్ యూనియన్‌లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యూనియన్ నాయకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశించారు. డీఆర్‌ఎం ఆంజనేయులు, ఏడిఆర్‌ఎం శ్రీనివాస్, సీనియర్ డీసీఎం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల మున్సిపాలిటీకి జాతీయ స్కోచ్ అవార్డు

మాచర్ల: మాచర్ల మున్సిపాలిటీకి జాతీయ స్థాయిలో స్కోచ్ అవార్డు లభించడం గర్వకారణమని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు పేర్కొన్నారు. ఈ అవార్డుతో జాతీయ స్థాయిలో మాచర్ల మున్సిపాలిటీ ప్రత్యేక గుర్తింపు పొందినట్లు తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం కమిషనర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆయా మున్సిపాలిటీలు అందిస్తున్న సేవలపై జాతీయ స్థాయిలో సర్వే నిర్వహించగా, మాచర్ల మున్సిపాలిటీ పారిశుద్ధ్యం నిర్వహణ, పరిశుభ్రతతో పాటు అనేక అంశాల్లో ముందు వరుసలో నిలిచినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని నాలుగు పురపాలక సంఘాలు స్కోచ్ అవార్డులకు ఎంపిక కాగా అందులో మాచర్ల మున్సిపాలిటీ ఒకటన్నారు. అవార్డు పొందడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ, జనసేనవి పగటికలలు



సాక్షి,అమరావతి: టీడీపీ, జనసేన నేతలు పగటికలలు కంటున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి విమర్శించారు. తాడేపల్లిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నేత అయ్యన్నపాత్రుడికి మతి చెడిందని, అందువల్లే తాను కాబోయే హోంమంత్రి అంటూ కలలు కంటున్నారని మండిపడ్డారు. 2024 ఎన్నికల్లో టీడీపీ నామరూపాలు లేకుండా పోతుందన్నారు. జనసేన నాయకుడు నాగబాబు ప్యాకేజీ పెంచుకునేందుకే సరికొత్త ఎత్తుగడలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నాగబాబు చెబుతున్నట్లు 40 శాతం ఓటింగ్ ఉంటే జనసేన ఒంటరిగానే పోటీ చేసి అధికారంలోకి రావొచ్చు కదా... చంద్రబాబుతో 'రాయబేరాలు' ఎందుకు... అని ప్రశ్నించారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు పూర్తిగా సీఎం వైఎస్ జగన్ ఫోబియా పట్టుకుందని, అందుకే జనసేనతో పొత్తు కోసం ఆరాటపడుతున్నారని చెప్పారు. నిస్వార్థంగా వలంటీర్లు సేవ చేస్తున్నారని, వారిపై కూడా టీడీపీ నేతలు విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. సీఎం జగన్ 99 శాతం హామీలను నెరవేర్చారని, తప్పకుండా మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

వ్యవసాయ కళాశాలకు అంతర్జాతీయ ఖ్యాతి

- రూ.వేల కోట్ల ఆదాయం సృష్టించిన బీపీటీ 5204 వంగడం
- జాతీయ స్థాయి ర్యాంకుల సరసన బాపట్ల కళాశాల
- విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి
- ఘనంగా బాపట్ల వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవం



వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాల లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ జీవీఎల్, ఎమ్మెల్యే కోన, వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి, పోతుల సునీత

బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాలలో సృష్టించిన బీపీటీ–5204 వరి వంగడం అంతర్జాతీయ ఖ్యాతిని గడించడమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా రైతులకు సంవత్సరానికి వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూరుస్తోందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో 11వ స్థానంలో నిలిచి బోధన, పరిశోధన, విస్తరణలో ప్రత్యేక స్థానాన్ని సాధించిందని తెలిపారు. దేశం మొత్తం రూపొందించబడుతున్న వరి వంగడాల్లో 1/3 వంతు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయమే సృష్టిస్తోందన్నారు. ఈ ఉత్సవాన్ని తొలుత ఎడ్ల బండ్లపై మేళతాళాలతో ఊరేగింపుగా ప్రారంభమైంది. భరతనాట్యం, విద్యార్థుల గ్రామీణ కోలాటాల నడుమ వీసీ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల వ్యవసాయ సంబంధిత ప్రదర్శనశాలలను ప్రారంభించారు. పెవిలియన్ వద్ద జరిగిన బహిరంగ సభలో రికార్డ్ స్థాయిలో 1200 మందికి పైగా పూర్వ విద్యార్థులు ఈ కళాశాలతో తమకు గల అనుబంధాన్ని ఆత్మీయంగా పంచుకున్నారు. వీసీ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి రైతు విగ్రహం వద్ద ప్లాటినం జూబ్లీ పైలాన్‌ను, బీపీటీ–5204 పైలాన్‌ను ఆవిష్కరించారు. పైలాన్ వద్ద నుంచి పరేడ్ ఆఫ్ ఫ్రైడ్ రెట్రోవాక్‌ను మేళతాళాలతో నిర్వహించారు. అనెక్స్ భవనం వద్ద సంప్రదాయ రాజస్థానీ, గ్రామీణ కోలాటాలతో వీరికి ఘన స్వాగతం పలికారు. 1975 సంవత్సర పూర్వ విద్యార్థులు 75 కొబ్బరిమొక్కలు నాటి సరికొత్త కొబ్బరి తోటను ప్రారంభించారు. పలువురు పూర్వ విద్యార్థులు నూతన అతిథి గృహ నిర్మాణానికి విరాళాలు అందజేశారు. అత్యంత అట్టహాసంగా ప్రారంభమైన అమృతోత్సవంలో రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, వ్యవసాయ డీన్ డాక్టర్ ఎ.ప్రతాప్ కుమార్ రెడ్డి, రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.ప్రశాంతి, విస్తరణ డైరెక్టర్ డాక్టర్ పి.రాంబాబు, విద్యార్థి విభాగం డీన్ డాక్టర్ పి.సాంబశివరావు, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ సీహెచ్ చిరంజీవి, అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఎ.మణి, ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి, పూర్వ అసోసియేట్ డీన్లు తదితరులు పాల్గొన్నారు.



బీపీటీ 5204 పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న వైస్‌చాన్సలర్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి

సమష్టి కృషితో విశ్వవిద్యాలయం సాధిద్దాం

బాపట్ల వ్యవసాయ కళాశాలలో ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేందుకు అందరం కలిసికట్టుగా ప్రయత్నం చేద్దామని ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్ని మాట్లాడారు. 1945 సంవత్సరం కళాశాల ఏర్పాడటానికి కారణాలను వివరించటంతో పాటు కళాశాల స్థాపించడానికి కృషి చేసిన పాములపాటి వెంకటరావు, బీవీ నాథ్, చొంటి రామమూర్తి, ఎస్ ఎస్ పాత్రుడును గుర్తుచేసుకోవాలని శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. ఈ కళాశాలలో చదువుతున్న ఎస్‌వీఎస్ శాస్త్రి, ఎస్‌జీబీ రావు, ఐటీ సుబ్బారావుకు పద్మశ్రీ అవార్డు వచ్చిందంటే కళాశాల ఖ్యాతి ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి సలహాదారులు అజేయ్‌కలామ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతికతను జోడించి ముందుకుపోవాలని సూచించారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు చదువు పూర్తి చేసుకునేలోపే వ్యవసాయ రంగానికి సంబంధించి ఏ విధంగా స్థిరపడాలో వారికి పూర్తి అవగాహన కల్పించాలని చెప్పారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ బాపట్ల ప్రాంతంలో చదివిన పూర్వ విద్యార్థులు ఈ ప్రాంతాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. విశ్వవిద్యాలయం బాపట్లకు తీసుకువచ్చేందుకు అందరూ సహకరించాలని కోరారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారులు ఎం.మాలకొండయ్య మాట్లాడుతూ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో పొందుపరిచిన కళాశాల చరిత్రను అందరికి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రిటైర్డు ఐపీఎస్ అధికారులు బి.శ్రీనివాసులు, దేవరపల్లి కనకరత్నం, ప్రభాకర్ మాట్లాడుతూ బాపట్ల వ్యవసాయ కళాశాల తమ జీవితాలకు మంచి బాట వేసిందని గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్సీలు కళ్యాణి, పోతుల సునీత మాట్లాడుతూ బాపట్ల వ్యవసాయ కళాశాల చరిత్రకు అనుగుణంగా విద్యార్థులు చక్కగా చదువుకుని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి, కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన 32 స్టాల్స్ అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆర్బీకేలతో విద్యార్థులకు ఉద్యోగాలు

బాపట్ల వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో మంత్రి కాకాణి




బాపట్ల: వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు ఆద్యుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రైతు గుండెలో నిలిచిపోతారని వ్యవసాయ, ఉద్యానవన, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వ్యవసాయాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా మెట్ట భూములకు నిరంతరం నీటిని అందిస్తూ రైతులకు ఎంతో సహాయకారిగా ముఖ్యమంత్రి నిలుస్తున్నారని కాకాణి కొనియాడారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో మంత్రి శనివారం ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాలను గ్రామీణ స్థాయిలో ప్రారంభించిన మొట్టమొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, వాటి ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు సబ్సిడీ ధరకు అందించడమే కాక రైతులు పండించిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకే ప్రభుత్వం తిరిగి కొనుగోలు చేస్తోందన్నారు. ఈ కేంద్రాలతో వ్యవసాయ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయన్నారు. రైతు బీమా పథకం ద్వారా నూటికి నూరు శాతం బీమా అందిస్తున్న తొలి రాష్ట్రంగా ఏపీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని చెప్పారు.

చిత్రకళా మణి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రం



శ్రీవారి చిత్రం



శ్రీకృష్ణుని వేషంలో ఎన్టీఆర్ చిత్రం

- అద్భుత చిత్రకళ మణికంఠ సొంతం
- ఎన్నో సజీవ చిత్రాలకు ప్రాణం పోస్తున్న యువ చిత్రకారుడు
- మట్టి, మైనంతో దేవుని ప్రతిమలు తీర్చిదిద్దుతున్న వైనం

పర్చూరు: అతని కుంచె నుంచి గీసే చిత్రాలు సజీవ చిత్రాల్లా దర్శనమిస్తాయి. రంగులతో సహవాసం.. కుంచెతో అద్భుత విన్యాసం.. చిత్రకళలో తనదైన ముద్రవేస్తున్నాడు వీరన్నపాలెం గ్రామానికి చెందిన నారాయణం శ్రీమణికంఠ. ప్రస్తుతం బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. చిన్ననాటి నుంచే ఈ కళపై ఆసక్తి పెంచుకున్నాడు. ఐదో తరగతి నుంచే తన ప్రతిభను చాటుకున్నాడు. నెహ్రూ బొమ్మ వేసి అందరితోనూ ఆహా అనిపించుకున్నాడు. ఇతని తండ్రి నారాయణం సమీర్‌కుమార్. దసరా శరన్నవరాత్రులకు అమ్మవారి అలంకరణలో ఆయన మంచి నిష్ణాతులు. నాన్న నుంచి మెలకువలు నేర్చుకున్న మణికంఠ ఎన్నో సజీవ చిత్రాలను ఆవిష్కరించాడు. ఏదైనా బొమ్మను చూసిన క్షణంలోనే అచ్చుగుద్దినట్టుగా దానిని ఆవిష్కరించే సామర్థ్యాన్ని సొంతం చేసుకున్నాడు. తన మేనమామ వేదాంతం ప్రసాద్ నుంచి బొమ్మలు గీయడంలో మరిన్నీ అంశాలు నేర్చుకున్నాడు. పాఠశాలలో చదివే రోజుల్లో డ్రాయింగ్ పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు సాధించాడు. చిన్నతనం నుంచే మట్టి, మైనంతో దేవతామూర్తులను చేయడం, స్వచ్ఛభారత్ పేరుతో అనేక బొమ్మలు వేశాడు. రాజకీయ నాయకులు, కళాకారులు.. సినీనటి అంజలి, మహానటి సావిత్రి, సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు, శ్రీకృష్ణుడి వేషధారణలో ఎన్టీఆర్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వరదరాజ పెరుమాళ్, శ్రీకృష్ణుడిగా ఇస్కాన్ పెయింటింగ్, కోయంబత్తూర్ శ్రీఅష్టాంశ వరద ఆంజనేయర్, మంత్రాలయం మూలరామ విగ్రహం, త్రివిక్రమ స్వామి వంటి మహనీయుల రూపాలను చూసిన వెంటనే గీయడం మణికంఠ ప్రత్యేకత. ప్రస్తుతం బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న మణికంఠ ఎవరి ఫొటోనైనా చూసిన 30 నిమిషాల వ్యవధిలో వేయగలడు.

మట్టితో, మైనంతో దేవుని ప్రతిమలు..

మట్టి బొమ్మ చేయడం కోసం నల్లమట్టిని నీటితో తడిపి మెత్తగా వచ్చిన తరువాత దేవతామూర్తుల రూపం కోసం చేతికి నువ్వుల నూనె రాసుకోవడం, చీపురు పుల్లలు, మెత్తటి బ్రెష్ ఉపయోగించడంతో బొమ్మలను చేసేవాడు. పది సంవత్సరాల నుంచి మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసి అందరికీ అందిస్తూ చిన్న వయస్సులోనే పర్యావరణ పరిరక్షణలో తనదైన పాత్రను పోషించి పలువురికి ఆదర్శంగా నిలిచాడు.

మైనంతో శ్రీమహావిష్ణువు, నటరాజవిగ్రహం, శ్రీరాముడు, లక్ష్మణుడు, సీత, హనుమంతుని ప్రతిమలను తయారు చేయడంలో శ్రీమణికంఠ మంచి నేర్పు, నైపుణ్యం ప్రదర్శించేవాడు. మైనం ముద్దను మెత్తగా చేసుకొని బొమ్మలకు రూపం తీసుకురావడంలో తనచేతి గోటిని, టూత్‌స్టిక్‌ను ఉపయోగించేవాడు. ఈ కుర్రాడి చిత్రాలను చూసిన ప్రతి ఒక్కరూ ఆనందించి ప్రశంసిస్తున్నారు.

చిత్రకళ అంటే చిన్ననాటి నుంచి మక్కువ..



చిన్నతనం నుంచే చిత్రకళ అంటే ఎంతో ఇష్టం. ప్రొఫెషనల్ వెబ్ డిజైనింగ్, మాస్టర్ ఇన్ యానిమేషన్ కోర్సు చేయాలని అనుకుంటున్నా. మట్టి, మైనంతో ప్రతిమలు తయారు చేయడం ఎంతో ఇష్టం. ఎవరైనా ప్రోత్సాహమిస్తే మరిన్ని మంచి చిత్రాలు గీస్తాను.

– నారాయణం శ్రీమణికంఠ, యువ చిత్రకారుడు

హోరాహోరీగా షూటింగ్‌బాల్ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) లీగ్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ స్త్రీ, పురుషుల పోటీల్లో గుంటూరు, నెల్లూరు జిల్లాల జట్లు సత్తా చాటాయి. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో శనివారం ఈ పోటీలు హోరాహోరీగా జరిగాయి. మహిళల విభాగంలో జరిగిన ఫైనల్స్‌లో గుంటూరు జట్టు విశాఖపట్నం జట్టును ఓడించి విజేతగా నిలిచింది. పురుషుల విభాగం ఫైనల్స్‌లో నెల్లూరు జట్టు పల్నాడు జట్టుపై గెలిచి విన్నర్ ట్రోఫీని అందుకుంది. మహిళల విభాగంలో విశాఖపట్నం జట్టు, పురుషుల విభాగంలో పల్నాడు జట్టు రన్నర్ ట్రోఫీలను అందుకున్నాయి. ఈ పోటీలను ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎస్.ఎ.అజీజ్ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి జోసఫ్, కృష్ణాజిల్లా సంఘం కార్యదర్శి కిషోర్, టోర్నమెంట్ డైరెక్టర్ మనోహర్‌రెడ్డి ఈ పోటీలను పర్యవేక్షించారు.



షూటింగ్ బాల్ రాష్ట్ర పోటీల్లో మహిళల విన్నర్ ట్రోఫీ అందుకున్న గుంటూరు జట్టు

కానిస్టేబుల్ రాత పరీక్షకు కట్టుదిట్ట చర్యలు



కానిస్టేబుల్ రాత పరీక్ష నిర్వహణపై సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్
- నేడు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష
- జిల్లాలో 15 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షలకు హాజరుకానున్న 8,567 మంది అభ్యర్థులు

బాపట్లటౌన్: కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా ప్రిలిమినరీ రాత పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన భద్రత చర్యలపై శనివారం ఎస్పీ తన కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ అధికారులు, స్క్వాడ్ బృందాలు, డీఎస్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత జిల్లాలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ జిల్లాలోని 15 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం ప్రిలిమినరీ పరీక్ష జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులను కేవలం గంట ముందు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. 10 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యం అయినా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని చెప్పారు. అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్‌లు, బ్లూటూత్, వాచ్ వంటి పరికరాలను పరీక్షా కేంద్రంలోకి తీసుకురాకూడదన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లతో పాటు ఒక ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు, పెన్సిల్, బ్లూ, బ్లాక్ బాల్ పెన్నులు మాత్రమే తీసుకురావాలని తెలిపారు.

అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ కేసు నమోదు..

అభ్యర్థులు ఎవరైనా పరీక్షకు సంబంధించి అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. పరీక్షా కేంద్రాల వద్ద డ్యూటీలో ఉన్న సిబ్బంది మాత్రమే ఉండాలన్నారు. ఇతరులు ఎవరైనా పరీక్షా కేంద్రంలో కానీ, పరీక్ష కేంద్రం సమీపంలో కానీ ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడి పట్టుబడితే తదుపరి పోలీస్ నియామకాలలో ప్రవేశం కోల్పోవడమే కాకుండా క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తారన్నారు.

దళారుల మాటలు నమ్మవద్దు

పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష, రిక్రూట్‌మెంట్ అంత పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో జరుగుతుంది. ఫిజికల్, రాత పరీక్షల్లో ఉత్తీర్ణత అయితేనే ఉద్యోగాలు వస్తాయని అభ్యర్థులు గుర్తుంచుకోవాలి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుంది. ఎవరు కూడా ప్రైవేట్ వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దు. ఎవరైనా అభ్యర్థులను మభ్యపెట్టే విధంగా ప్రవర్తిస్తున్నట్లు ఏదైనా సమాచారం ఉంటే మా దృష్టికి తీసుకురావాలి.

– వకుల్‌జిందాల్, ఎస్పీ

జిల్లాలోని పరీక్షా కేంద్రాలు ఇవే..

పరీక్షా కేంద్రం పేరు	హాజరయ్యే అభ్యర్థులు
సెయింట్ ఆన్స్ కళాశాల సెంటర్ –1	2800
సెయింట్ ఆన్స్ కళాశాల సెంటర్ –2	800
చీరాల ఇంజినీరింగ్ కళాశాల	1000
చీరాల ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాల	288
వేటపాలెం బీబీహెచ్ జూనియర్ కళాశాల	240
వేటపాలెం భారతి డిగ్రీ కళాశాల	240
చీరాల విజ్ఞాన్‌భారతి జూనియర్ కళాశాల	240
చీరాల శ్రీగౌతమి జూనియర్ కళాశాల	240
బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల సెంటర్ –1	500
బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల సెంటర్ – 2	500
బాపట్ల పాలిటెక్నిక్ కళాశాల	600
బాపట్ల ఫార్మసీ కళాశాల	400
బాపట్ల పబ్లిక్ స్కూల్	250
బాపట్ల ఎస్‌ఏడబ్ల్యూబీ జూనియర్ కళాశాల	240
బాపట్ల ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల	229
మొత్తం	8567

సంక్షేమపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి

మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున, పక్కన ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

నిజాంపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ రాజ్యాన్ని స్థాపించి పారదర్శక పాలన సాగిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మండలంలోని పల్లపట్లలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావుతో కలసి శనివారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు ఆయన వద్దే ఉంచుకున్న శాఖలో ఖర్చు చేసిన నిధులకు కనీసం లెక్కలు లేనివిధంగా అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ పాలనలో జరిగిన లబ్ధి ఏ ప్రభుత్వంలో జరగలేని పేర్కొన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులకు పెంపుదల చేసేందుకు సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల ప్రాణాలు పోతున్న టీడీపీ నాయకులకు పట్టడం లేదని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు విమర్శించారు. బహిరంగ సభలు పెట్టుకునే సమయంలో ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆయా రాజకీయ పార్టీలు గుర్తుంచుకోవాలన్నారు. జీఓ నంబర్ 1 పై రాజకీయం చేయటం చంద్రబాబుకు తగదని హితవు పలికారు. లోకేష్ పాదయాత్రకు ఇచ్చిన షెడ్యూల్‌లో కుప్పం నుంచి తిరుపతి వరకు క్రమం తప్పకుండా చేసే లోకేష్ సత్తా ఏమిటో తెలుస్తుందని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించేందుకు పోటీ పరీక్షలు

బాపట్ల డీఈఓ రామారావు



మొదటిస్థానం సాధించిన భాగ్యశ్రీరేఖకు బహుమతిని అందిస్తున్న డీఈఓ రామారావు

చెరుకుపల్లి: విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించేందుకు పోటీ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు పేర్కొన్నారు. మండలంలోని గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సోషల్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీఎస్‌ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఎన్‌ఎంఎంఎస్ జిల్లా స్థాయి మోడల్ పరీక్ష శనివారం నిర్వహించారు, 53 ఉన్నత పాఠశాలలకు చెందిన 650 మంది 8వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్ష అనంతరం మూల్యాంకనం చేసి జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు మరియు నియోజకవర్గాల వారీగా ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు బహుమతులు అందజేశారు. డీఈఓ రామారావు మాట్లాడుతూ ఫిబ్రవరి 5న నిర్వహించనున్న ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు జిల్లాలో ప్రతి పాఠశాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులతో పోటీ పరీక్ష రాయించాలని హెచ్‌ఎంలకు సూచించారు, జిల్లా స్థాయిలో ఇటువంటి పోటీ పరీక్ష నిర్వహించిన ఏపీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం మురళిని, పాఠశాల హెచ్‌ఎం, భట్టిప్రోలు ఎంఈఓ పులి లాజర్‌లను అభినందించారు. అనంతరం పరీక్షలో విజేతలు జిల్లాలో మొదటి స్థానం ఎం.భాగ్యశ్రీరేఖ(జెడ్పీ హెచ్‌ఎస్, నిజాంపట్నం), రెండో స్థానం ఐ.రిషిక(జెడ్పీహెచ్‌ఎస్ వేటపాలెం), జి.దీప్తి నాగకౌశల్య(జెడ్పీ హెచ్‌ఎస్, ఐలవరం), మూడో స్థానం కన్నా మీరారావు(జెడ్పీ హెచ్‌ఎస్, నిజాంపట్నం) సాధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లు కె.నిరీక్షణ రావు, కాటూరి లక్ష్మీనారాయణ, జే శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

నాడు– నేడు పనులు పరిశీలన

బాపట్ల అర్బన్: నాడు– నేడు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని డీఈఓ రామారావు సూచించారు. మండలంలోని చెరువుజమ్ములపాలెంలో చేపట్టిన పనులను శనివారం పరిశీలించారు. సచివాలయం సిబ్బంది రికార్డులను పరిశీలించటంతోపాటు మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులతో కలసి భోజనం చేశారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి బి.సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు షేక్ సుభాని పాల్గొన్నారు.

ఈనెల 23న ఫెన్సింగ్, సైక్లింగ్ జట్ల ఎంపిక పోటీలు

కర్లపాలెం: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఫెన్సింగ్, సైక్లింగ్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 23న చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17 విభాగాలలో క్రీడాకారులు తమ స్టడీ సర్టిఫికెట్ ఆధార్‌కార్డు డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్ జిరాక్సులు తీసుకుని సెలక్షన్స్‌కి హాజరు కావాలని ప్రతాప్‌రెడ్డి కోరారు. వివరాలకు సెలక్షన్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు ఎం.గోపి సెల్ నంబర్ 9849275810ను సంప్రదించాలని సూచించారు.

శింగరకొండలో హైకోర్టు జడ్జి పూజలు



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి దంపతులు

అద్దంకి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అడుసుమల్లి రవీంద్రబాబు దంపతులు బాపట్ల జిల్లా శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద పూజల అనంతరం గర్భాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జడ్జికి అర్చకులు, ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోట శ్రీనివాస కుమార్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. పూజల అనంతరం పూలమాల వేసి, శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. శనివారం జిల్లా వ్యాప్తంగా నో యాక్సిడెంట్ డే ను నిర్వహించారు. దానిలో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలపై ప్రయాణికులు అవగాహన కల్పించారు.

డ్రిప్, స్ప్రింక్లర్లను వినియోగించుకోవాలి



మార్టూరు: సూక్ష్మ సేద్యం అభివృద్ధి కోసం ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీని వినియోగించుకొని అధిక దిగుబడులు సాధించాలని బాపట్ల జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి బీవీ రమణ అన్నారు. మండలంలోని వలపర్ల గ్రామంలో శనివారం రైతులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదెకరాల్లోపు భూమి కలిగిన రైతులు డ్రిప్ కోసం 90 శాతం సబ్సిడీని, 5 నుంచి 10 ఎకరాల్లోపు భూమి కలిగిన రైతులకు 70 శాతం, స్ప్రింక్లర్ల కోసం 50 శాతం సబ్సిడీ ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. బోర్లు, బావులు కలిగిన రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. గ్రామానికి చెందిన 10 మంది రైతులకు మొదటి దశ సబ్సిడీపై అందజేసిన స్ప్రింక్లర్లు, పైపులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి బీ హనుమంతనాయక్ పాల్గొన్నారు.